నమస్తే తెలంగాణ
# ఖమ్మం
5 | ఖమ్మం, మంగళవారం 30 జూలై 2024 | KHAMMAM

## కాంగ్రెస్‌ది ప్రజలను వంచించే పాలన

### బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

పినపాక, జూలై 29 : అలవిగాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అందిస్తున్నది ప్రజా పాలన కాదని.. ప్రజలను వంచించే పాలన అని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ధ్వజమెత్తారు. సోమవారం ఈ బయ్యారం అడ్డరోడ్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్క పథకాన్ని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని మండిపడ్డారు. గ్రామాల్లో చాలా మంది అర్హులైన రైతులకు రుణమాఫీ కాలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల అబద్ధపు పాలనపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. బీఆర్ఎస్ నాయకులు అధైర్యపడొద్దని, భవిష్యత్‌లో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. నాయకులు, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పగడాల సతీశ్ రెడ్డి, ఎంపీపీ గుమ్మడి గాంధీ, ఎంపీటీసీ కాయం శేఖర్, పీఏసీఎస్ అధ్యక్షుడు వర్మ, నాయకులు భద్రయ్య, భవానీ శంకర్, వాసుబాబు, బుల్లిబాబు, వెంకటరెడ్డి, సత్తిబాబు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

## ఎస్‌ఏల ప్రమోషన్ల ఉత్తర్వులు విడుదల

### ప్రైమరీ స్కూళ్ల హెచ్‌ఎంలుగా 25 మందికి అవకాశం

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 29: సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్‌జీటీ)లకు స్కూల్ అసిస్టెంట్లు (ఎస్‌ఏ)గా ప్రమోషన్లు కల్పిస్తూ డీఈవో సోమశేఖరశర్మ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 75 ఖాళీలు ఉండగా 74 మందికి పదోన్నతులు కల్పించారు. స్కూల్ అసిస్టెంట్ హిందీ వీహెచ్ కేటగిరీలో ఆ అర్హత కలిగిన అభ్యర్థి లేకపోవడంతో పదోన్నతి కల్పించలేదు. మిగిలిన 74 పదోన్నతుల్లో 25 మందికి ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా అవకాశం లభించింది. ప్రథమ ప్రాధాన్యంగా ఎక్కువమంది పీఎస్ హెచ్‌ఎంగా తమ ఆప్షన్‌ను ఎంపిక చేసుకున్నారు. 24 మందికి సోషల్ సబ్జెక్టులో పదోన్నతి కల్పించారు. 11 మందికి ఎస్‌ఏ ఇంగ్లిష్‌లో, ఆరుగురికి ఎస్‌ఏ గణితంలో, 8 మందికి ఎస్‌ఏ జీవశాస్త్రంలో పదోన్నతి కల్పించారు. వీరందరూ లోకల్ బాడీస్ స్కూళ్లలో తెలుగు మీడియం పరిధిలో పదోన్నతులు పొందారు. పదోన్నతులు పొందిన 74 మంది ఉపాధ్యాయులను ఆయా ఖాళీల్లో భర్తీ చేశారు. నూతన బాధ్యతల్లో చేరేందుకు పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులను, మండల విద్యాశాఖాధికారులను డీఈవో ఆదేశించారు.

### నాటి కాంగ్రెస్ ప్రభుత్వ దమనకాండను గుర్తుచేస్తూ కేటీఆర్ ట్వీట్


KTR @KTRBRS · 10h
ముదిగొండ మారణహోమానికి 17 ఏళ్లు !

కాంగ్రెస్ పార్టీ చేసిన మరో మారణహోమం ముదిగొండ కాల్పులు !

నాడు(2007) ఖమ్మం జిల్లా ముదిగొండలో, రైతులని మరియు కమ్యూనిస్టులను పిట్టల లెక్క కాల్చి చంపిన కాంగ్రెస్ ప్రభుత్వం..

Never Forget

కేటీఆర్ చేసిన ట్వీట్

## ముదిగొండ మారణహోమానికి 17 ఏళ్లు

ముదిగొండ, జూలై 29: 2007లో జరిగిన ముదిగొండ కాల్పుల ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విట్టర్ ద్వారా సోమవారం స్పందించారు. నాటి కాల్పుల ఘటనకు ఆదివారంతో 17 ఏళ్లు పూర్తైన సందర్భంగా మృతులకు ట్విట్టర్ వేదికగా నివాళి అర్పించారు. 'ముదిగొండ మారణహోమానికి 17 ఏళ్లు, కాంగ్రెస్ పార్టీ చేసిన మరో దమనకాండ ముదిగొండ కాల్పులు' అని విమర్శించారు. రైతులు, కమ్యూనిస్టులను పిట్టల్లా నాటి కాంగ్రెస్ ప్రభుత్వం కాల్చి చంపిందని పేర్కొన్నారు. నాటి ఘటనకు సంబంధించిన ఫొటో షేర్ చేస్తూ మర్చిపోలేని ఘటన అని ట్యాగ్‌లైన్ పెట్టారు. ఇక్కడి దుర్ఘటనను గుర్తుంచుకుని కేటీఆర్ స్పందించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తంచేశారు.

## నిలిచిన 'భగీరథ' నీటి సరఫరా

- నాలుగు నెలలుగా వేతనాలివ్వని కాంట్రాక్టర్
- విధులు బహిష్కరించిన పంపు ఆపరేటర్లు
- గ్రామాల్లో రెండు రోజులుగా నీళ్లు బంద్
- ఇబ్బందులు పడుతున్న గ్రామాల ప్రజలు


విధులు బహిష్కరించి నిరసనకు దిగిన పంపు ఆపరేటర్లు

ఖమ్మం రూరల్, జూలై 29: గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన మిషన్ భగీరథ పథకం ప్రజల్లో విశేష ఆదరణ చూరగొన్నది. జలాశయాల నుంచి పంపుహౌస్‌ల ద్వారా సేకరించిన నీటిని శుద్ధి చేసి గ్రామాలకు తరలించడం, అక్కడి నుంచి ఇంటింటికీ స్వచ్ఛమైన జలాలను సరఫరా చేయడం వంటి ప్రక్రియ గత కేసీఆర్ ప్రభుత్వంలో నిరాటంకంగా కొనసాగింది. ఈ ప్రక్రియలో కాంట్రాక్టు విధానంలో అనేక మంది పంపు ఆపరేటర్లకు ఉపాధి కల్పించింది. గత కేసీఆర్ ప్రభుత్వం క్రమం తప్పకుండా కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించడం, వారు వాటిని పంపు ఆపరేటర్లకు వేతనాలుగా అందించడం వంటి ప్రక్రియ సాఫీగా సాగేది. కానీ.. ఎనిమిది నెలల క్రితం వచ్చిన కాంగ్రెస్ సర్కారు.. కాంట్రాక్టర్లకు సక్రమంగా బిల్లులు చెల్లించడం లేదు. దీంతో వారు పంపు ఆపరేటర్లకు వేతనాలు సకాలంలో ఇవ్వడం లేదు. దాని ప్రభావం ఆయా గ్రామాల ప్రజల మీద పడుతోంది.

**నాలుగు నెలలుగా వేతనాల్లేక..**

ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం చిన్నతండాలోని ఓహెచ్‌బీఆర్ పరిధిలోని 21 మంది యువకులు కాంట్రాక్టు పద్ధతిలో మిషన్ భగీరథ పంపు ఆపరేటర్లుగా పనిచేస్తున్నారు. రిజర్వాయర్ ద్వారా కేంద్రానికి వచ్చిన నీటిని శుద్ధి చేసి వాటిని గ్రామాల్లోని వాటర్ ట్యాంకులకు పంపిస్తున్నారు. గ్రామాల్లో గేట్ వాల్వులను ఆపరేట్ చేసి ఉదయం, సాయంత్రం వేళల్లో ఇంటింటికీ స్వచ్ఛమైన నీటిని అందిస్తున్నారు. ఇందుకు గాను సంబంధిత కాంట్రాక్టర్ వీరిలో ఒక్కొక్కరికీ నెలకు రూ.13,500 చొప్పున వేతనం అందిస్తారు. ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలనూ కల్పిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఈ ఎనిమిది నెలల్లో గడిచిన నాలుగు నెలలుగా వీరికి వేతనాలు చెల్లించడం లేదు. మూడు నెలలుగా మొరపెట్టుకుంటున్నా కనీస స్పందన లేదు. కాంట్రాక్టర్‌ను అడిగితే రేపు మాపు అంటూ కాలయాపన చేస్తున్నాడు. పీఎఫ్, ఈఎస్ఐల వాయిదాలను కూడా ఆయా ఖాతాల్లో జమ చేయడం లేదు. దీంతో విసిగి వేసారిన పంపు ఆపరేటర్లు ఆదివారం నుంచి విధులు బహిష్కరించి నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను వెళ్లదీస్తున్న తమకు నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రతి నెలా జీతం అందితేనే భార్యాపిల్లలను పోషించుకోవడం కష్టంగా ఉంటున్న తమలాంటి చిరు వేతనదారులకు నెలల తరబడి జీతాలను ఇవ్వకుండా ఎలా జీవించాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెండింగ్ ఉన్న నాలుగు నెలలకుగాను ఒక నెల వేతనాన్ని రెండు మూడు రోజుల్లో చెల్లించేలా చూస్తామంటూ మిషన్ భగీరథ అధికారులు అంటుండడం తమకు మరింత వేదనకు గురిచేస్తోందని ఆవేదన చెందుతున్నారు. తమకు వేతనాలు అందే వరకూ విధులు బహిష్కరిస్తామని స్పష్టం చేస్తున్నారు.

**రెండు రోజులుగా నిలిచిన సరఫరా..**

కాగా, ఖమ్మం రూరల్ మండలంలోని పలు గ్రామాలకు ఆదివారం సాయంత్రం నుంచి మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరైతే సుదూర ప్రాంతాలకు వెళ్లి వాటర్ ప్లాంట్ల వద్ద తాగునీటిని కొనుగోలు చేసుకొని తెచ్చుకుంటున్నారు. వర్షాలు కురుస్తున్న ఈ సమయంలో అలా తెచ్చుకోలేని వారి ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి.

### విద్యార్థుల్లో అభ్యసన ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా ట్రైనింగ్
### ప్రాథమిక పాఠశాలల్లో మండలం నుంచి నలుగురు టీచర్లకు..
### ఉన్నత పాఠశాలల్లో రెండు మండలాల నుంచి 12 మందికి..
### 'ఖమ్మం డైట్'లో నేటినుంచి రెండు రోజులు టీచర్లకు తర్ఫీదు

# న్యాస్‌కి శిక్షణ



డైట్ కళాశాల

ఖమ్మం, జూలై 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : చిన్నచిన్న పదాలు, సంఖ్యలు, పటాలపై చారిత్రక ప్రదేశాలు, ప్రాంతాలను గుర్తించేందుకు చాలామంది విద్యార్థులు సమస్యలను ఎదుర్కొంటున్నారు. పాఠశాల స్థాయిలో నిర్వహించే పరీక్షల్లో ప్రతిభ కనబరుస్తున్నప్పటికీ జాతీయ స్థాయిలో నిర్వహించే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(న్యాస్)లో సత్తా చాటలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు కనీస అభ్యసన ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా విద్యాశాఖ అధికారులు.. ఉపాధ్యాయులకు శిక్షణ కల్పించేందుకు సిద్ధమయ్యారు. దీనిలో భాగంగా ఖమ్మంలోని డిస్ట్రిక్ట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రైనింగ్ అండ్ ఎడ్యుకేషన్(డైట్) కళాశాలలో మంగళ, బుధవారాల్లో శిక్షణ ఇవ్వనున్నారు.

**నేటి నుంచి రెండు రోజులు..**

ఖమ్మం జిల్లాలోని 21 మండలాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల్లో మండలాలవారీగా కొంతమందిని ఎంపిక చేశారు. వీరిలో ప్రాథమిక పాఠశాలల పరిధిలో మండలం నుంచి నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. అందులోనూ ఒక్కో పాఠశాల నుంచి ఒక్కో సబ్జెక్టు(తెలుగు, ఇంగ్లిష్, గణితం, పరిసరాల విజ్ఞానం) టీచర్లను ఎంపిక చేశారు. ఉన్నత పాఠశాలల పరిధిలో రెండు మండలాలను ఒక గ్రూపుగా కలిపి 12 మందిని ఎంపిక చేశారు. వీరిలో ఒక్కో పాఠశాల నుంచి ఒక్కో సబ్జెక్టు(తెలుగు, ఇంగ్లిష్, గణితం, ఫిజిక్స్, జీవశాస్త్రం, సోషల్) టీచర్లు ఉన్నారు. ఈ నెల 30న మంగళవారం ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలల నుంచి ఎంపిక చేసిన టీచర్లకు తెలుగు, ఇంగ్లిష్ సబ్జెక్టులపై రిసోర్స్ పర్సన్లు శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే, 31న బుధవారం గణితం, పరిసరాల విజ్ఞానం, ఫిజిక్స్, జీవశాస్త్రం, సోషల్ సబ్జెక్టుల్లో శిక్షణ ఇవ్వనున్నారు.

**పరీక్షకు సన్నద్ధం చేసేలా..**

న్యాస్‌కు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు శిక్షణ కార్యక్రమాలు మొదలయ్యాయి. ఈ దఫా 2024 నవంబర్ 30న పరీక్షను నిర్వహించనున్నారు. 3, 6, 9 తరగతుల్లో ఎంపిక చేసిన ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లోని విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవుతారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు ఇంగ్లిష్, గణితమంటే వణికిపోకుండా నూతన పద్ధతుల్లో వారిని సన్నద్ధం చేయనున్నారు. 6, 9 తరగతుల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. కనీస పరిజ్ఞానం కొరవడడంతోపాటు భాషలో బలహీనంగా, వెనుకంజలో ఉన్న విద్యార్థులను గుర్తించి శిక్షణ ఇవ్వనున్నారు.

**20 మంది రిసోర్స్ పర్సన్లు..**

జిల్లా నుంచి ఎంపిక చేసిన 20 మంది రిసోర్స్ పర్సన్లు రాష్ట్రంలో ఈ నెల 22, 23 తేదీల్లో ఎన్‌సీఈఆర్‌టీలో శిక్షణ పొందారు. వీరి ఆధ్వర్యంలో రెండు రోజులపాటు ప్రాథమిక పాఠశాలల నుంచి 84 మంది, ఉన్నత పాఠశాలల నుంచి 120 మంది ఉపాధ్యాయులకు ఖమ్మంలో శిక్షణ ఇవ్వనున్నారు. న్యాస్ పరీక్ష ఓఎంఆర్ ఆధారంగా జరగనున్నందున ఓఎంఆర్ పత్రాలపై సమాధానాలు గుర్తించేందుకు వీలుగా విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. ఈ ప్రక్రియలో సాధారణ సిలబస్ బోధనతోపాటు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(న్యాస్) మాదిరి ప్రశ్నలను కూడా ఇస్తారు.

**'తొలిమెట్టు' ఉపయోగంగా..**

పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలు పెంచడమే లక్ష్యంగా గత కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు అమలు చేసింది. 'తొలిమెట్టు' వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను చాలా వరకు మెరుగుపరిచాయి. ఈసారి నిర్వహించే 'న్యాస్' పరీక్షకు 'తొలిమెట్టు' కార్యక్రమం ఎంతగానో దోహదపడనుంది. చదవడం, రాయడం, పాఠంలోంచి కొత్త ఆలోచన రేకెత్తించడం వంటి సరికొత్త పద్ధతులను అనుసరించి విద్యార్థుల ప్రమాణాలు పెంచారు.

**కోర్సు డైరెక్టర్‌గా 'డైట్' ప్రిన్సిపాల్..**



డైట్ కళాశాలలో నిర్వహించే న్యాస్ శిక్షణకు కోర్సు డైరెక్టర్‌గా డైట్ ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ, కోఆర్డినేటర్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్‌గా కేశవపట్నం రవికుమార్ వ్యవహరించనున్నారు. డైట్‌లో శిక్షణకు అనుగుణంగా తరగతి గదులు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకునేందుకు అవసరమైన కేయాన్స్, శిక్షణకు హాజరయ్యే ఉపాధ్యాయులకు భోజన వసతి కల్పించనున్నారు.

## 'గ్రీవెన్స్'లో నేరుగా ఫిర్యాదు చేయొచ్చు : భద్రాద్రి ఎస్పీ


గ్రీవెన్స్ డేలో బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం క్రైం, జూలై 29 : ప్రజలు తమ సమస్యలపై గ్రీవెన్స్‌లో నేరుగా ఫిర్యాదు చేయవచ్చని, ప్రతి సోమవారం నిర్వహించే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు అన్నారు. తన కార్యాలయంలో సోమవారం తొలిసారిగా నిర్వహించిన గ్రీవెన్స్ డేలో బాధితుల నుంచి ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. బాధితుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. తొలి గ్రీవెన్స్ డేలో ఐదుగురు బాధితులు వివిధ సమస్యలతో వచ్చి ఫిర్యాదు చేశారు. భూ తగాదాలు, భార్యాభర్తల సమస్యలు, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా న్యాయం జరగకపోవడం వంటి అంశాలపై ఎస్పీకి ఫిర్యాదులు అందాయి. దీంతో వెంటనే ఆయన స్పందించి ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులతో మాట్లాడారు. బాధితుల సమస్యలపై సమగ్ర విచారణ చేపట్టి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

## నేడు మలివిడత రుణమాఫీ నిధులు విడుదల

- 21 రైతువేదికల ద్వారా కర్షకుల ప్రత్యక్ష వీక్షణకు ఏర్పాట్లు
- తొలి విడతలో మాఫీ కాని రైతులకు ఈ విడతలో అయ్యేనా?

ఖమ్మం వ్యవసాయం, జూలై 29: పంటల రుణమాఫీ రెండో విడత నిధులు మంగళవారం విడుదల కానున్నాయి. ఉదయం 11 గంటల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి.. రైతుల రుణ ఖాతాల్లో నిధులు జమ చేసే ప్రక్రియను హైదరాబాద్ నుంచి ప్రారంభిస్తారు. తొలి విడత నిధుల విడుదల కార్యక్రమం తరహాలోనే రెండో విడతలో కూడా ప్రత్యక్ష కార్యక్రమాన్ని రైతులు వీక్షించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం కలిగిన 21 రైతువేదికలను సిద్ధం చేశారు. ప్రతి మండలానికీ ఒకటి చొప్పున ఏర్పాటు చేసిన అధికారులు.. ఈ కార్యక్రమానికి మరోసారి ఆయా క్లస్టర్ల పరిధిలోని రైతులను తీసుకురానున్నారు. జిల్లాలో రూ.లక్షలోపు పంట రుణాలు తీసుకున్న 59,172 మంది రైతులకు గాను రూ.264.23 కోట్లను తొలి విడతలో భాగంగా ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసిన విషయం విదితమే. అయితే, రూ.లక్షలోపు పంట రుణాలు తీసుకున్న ఇంకా చాలామంది రైతులకు రుణమాఫీ కాలేదు. వివిధ సాంకేతిక కారణాలు, ఒకటికంటే ఎక్కువ బ్యాంకుల్లో రుణాలు తీసుకోవడం వంటి కారణాల వల్ల మాఫీ రాలేదని, రెండో జాబితాలో తప్పకుండా పేరు వస్తుందని రైతులకు అధికారులు చెబుతున్నారు. అయితే, మొదటి విడతలో రుణాలు మాఫీకాని అర్హత కలిగిన రైతులకు రెండో విడతలో అయినా మాఫీ అవుతుందో లేదో చూడాలి. కాగా, రెండో విడతలో 34,116 మంది రైతుల ఖాతాల్లో రుణమాఫీ నగదు జమ కానుంది.

# అడుగుకో గుంత..
# ఆదమరిస్తే చింత

### ఖమ్మం రోడ్లపై ప్రమాదకరంగా గుంతలు

ఖమ్మం, జూలై 29: నిన్నామొన్నటి దాకా అద్దంలా మెరిసిన అంతర్గత రహదారులు.. నేడు అడుగుకో గుంతతో ప్రమాదభరితంగా మారాయి. ఆదమరిచి అడుగేస్తే పెద్ద చింతనే తెచ్చిపెట్టేలా ఉన్నాయి. గత కేసీఆర్ ప్రభుత్వంలో సుందర నగరంగా రూపుదిద్దుకున్న ఖమ్మాన్ని.. రాష్ట్రంలోని వివిధ మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల పాలకవర్గాల బాధ్యులు కూడా వచ్చి చూసి వెళ్లారు. ఇక్కడి రోడ్ల నమూనాను తమ వద్ద కూడా ఇలాంటి రోడ్లను నిర్మించుకున్నారు. కానీ.. ఎనిమిది నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్ల నిర్వహణకు గాలికొదిలేసింది. వర్షాల వల్ల ఎక్కడైనా రోడ్లపై నీళ్లు నిలిస్తే తొలగించే చర్యలు చేపట్టకుండా వాటిని అలా వదిలేసింది. దీంతో రోడ్లన్నీ ధ్వంసమయ్యాయి. ఫలితంగా అడుగుకో గుంత పడింది. ఆ మార్గంలో ప్రయాణించే వాహనాలు ధ్వంసమవుతున్నాయి. వాటిపై ప్రయాణించే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఒక్కోసారి కిందపడి గాయాలపాలైన ఘటనలూ ఉన్నాయి. పెద్దపెద్ద గుంతలున్న ఆటోలు, కార్ల వంటి వాహనాలు కూడా ప్రమాదాల బారిన పడుతుండడం గమనార్హం.


ఎన్టీఆర్ సర్కిల్‌లో నడి రోడ్డుపై పడిన గుంత


మంగలికాలనీలో..


మామిళ్లగూడెంలో..


సహకార నగర్‌లో..


బ్యాంకు కాలనీలో..


ఎన్నెస్పీ రోడ్డులో..

## 'ట్రాక్'పై లారీ

రహదారిపై రయ్‌రయ్‌మంటూ వెళ్లాల్సిన లారీ.. రూటు మార్చి రైలు పట్టాలపై పరిగెడుతోంది. ఈ విచిత్రాన్ని రోడ్డు వెంట బాటసారులు, రైలు ప్రయాణికులు చూసి ఆశ్చర్యపోతున్నారు. బోనకల్లు రైల్వే స్టేషన్ వద్ద మూడో లైన్ ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ సామగ్రిని తరలించే నిమిత్తం కొత్తగా వేసిన మూడో లైన్‌పై లారీకి రైలు చక్రాలను అమర్చి ఎంచక్కా వాడుతున్నాడు. రైలు రోడ్డెక్కదేమోకానీ.. లారీ మాత్రం పట్టాలపై పరిగెడుతుందని నిరూపించింది.

*- బోనకల్లు, జూలై 29*



బోనకల్లులో రైల్వే ట్రాక్‌పై నడుస్తున్న లారీ